క్లుప్తంగా

నిలిచిపోయిన డ్రెయిన్ పనులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన సైడ్ డ్రెయిన్‌ల పనులు శనివారం నిలిచిపోయాయి. రెండురోజుల క్రితం రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో డ్రెయిన్ పనులు ప్రారంభించన విషయం విదితమే. కాగా నిర్మాణంతో తమ గృహాలకు నష్టం వాటిల్లుతుందని 11 మంది బాధితులు హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించింది. నాలుగు వారాల గడువును ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్‌ఐకు ప్రశంసాపత్రం



ఎస్పీ రోహిత్‌రాజ్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌ఐ స్వప్న

చండ్రుగొండ: మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వార జరిగే అనర్థాలతోపాటు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ఎస్‌ఐ స్వప్న ప్రజలకు అవగాహన కల్పించండలో తీసుకుంటున్న చొరను గుర్తిస్తూ జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం ప్రశంసాపత్రం అందించారు. రాష్ట్ర డైరెక్టర్ సందీప్ శాండల్యా పంపించిన ప్రశంసాపత్రాన్ని ఎస్పీ, ఎస్‌ఐ గంజి స్వప్నకు అందించారు. అంకితభావంతో విధుల నిర్వహించే కానిస్టేబుల్ కోటేశ్వరరావు ప్రశంసాపత్రం అందుకున్న వారిలో ఉన్నారు.

తిరుపతి లడ్డూపై రాజకీయం సరికాదు

భద్రాచలం: భక్తులు ఎంతో పవిత్రంగా, ప్రీతిపాత్రంగా భావించే తిరుమల తిరుపతి లడ్డూపై ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు రాజకీయం చేయటం అత్యంత హేయమైన చర్య అని భద్రాద్రిప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. దీనిపై రాజకీయాలకు అతీతంగా సుప్రీంకోర్టుతో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2002–23లో చదివిన విద్యార్థులు.. ఇదే పాఠశాలకు రూ.2వేలు విలువ గల లెర్నింగ్ మెటీరియల్, లెర్నింగ్ ఛార్ట్స్ శనివారం అందజేశారు. వీటితో పాటు పాఠశాలకు రంగుల వేయడం కోసం మరో రూ.6 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన తమ్మిసెట్టి శేఖర్ బాబు మాస్టర్‌ను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్ది ప్రవీణ్ రెడ్డి, కిల్లంపల్లి సురేష్, గుడ్ల శివారెడ్డి , జీరి అన్వేష్ రెడ్డి, సీరపు సంజయ్ కాంత్ రెడ్డి,గోసుల చిరంజీవి, బానోతు సుమబిందు, అవ్వారి రాగ సుధ, కరణం సత్యవాణి, అచ్చి శృతి, జీరీ సౌమ్య, రొక్కళ్ల సంధ్యారాణి, కోడి పావని, డింగి సందీప్ రెడ్డి, శ్రీకాకులపు మురళి, పిట్ట శ్రీలక్ష్మి, మద్ది జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయురాలు అపక సుశీల తదితరులున్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

దమ్మపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లను రద్దుచేసి, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మందలపల్లి గ్రామంలో కార్మిక సంఘాల ఉమ్మడి కార్యాచరణ సమావేశాన్ని నిర్వహించారు. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 23న బ్లాక్ డేగా జరుపుకోవాలని నిర్ణయించారు. నాయకులు అర్జున్, వీరబాబు, రాము, లక్ష్మీనారాయణ, శ్రీనివాస రావు పాల్గొన్నారు

లాభాల్లో వాటా హర్షణీయం

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా సింగరేణి సంస్థ అర్జించిన లాభాల్లో నుంచి రూ.5వేలు ప్రకటించడం హర్షణీయమని ఇఫ్టూ నాయకులు మంగీలాల్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలోని కేసిహెచ్‌పిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసిహెచ్‌పి బెల్ట్ క్లీనింగ్ సూపర్‌వైజర్లు, కార్మికులు జె.లక్ష్మీనారాయణ, టి.భద్రం, జె.కృష్ణ, బి.నగేష్, పి.వెంకటేశ్వర్లు, ఆర్.లింగయ్య, మురళి, నరేష్, రాజేష్, రామ్మూర్తి, అరుణ, రమణ, దుర్గ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ రూ.15,516

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం దగ్గరి లడ్డూ ప్రసాదం రూ.15,516ను పాటదారులు దక్కించుకున్నారు. వినాయక శరన్నవరాత్రులు సందర్భంగా 15వ రోజు శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డు ప్రసాదాన్ని నంబూరి సురేష్, పాలాడి సూర్య ప్రభాకర్ రావు, కొవ్వూరి రమాదేవిలు సంయుక్తంగా దక్కించుకున్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం

- చెత్తాచెదారం తొలగించిన అధికారులు, విద్యార్థులు
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ
- పురవీధుల్లో అవగాహన ర్యాలీలు


కరకగూడెం: గడ్డిని తొలగిస్తున్న అధికారులు, పాఠశాల సిబ్బంది


మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల పరిసరాల్లోని చెత్త, పిచ్చి మొక్కలను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పచ్చదనంతో పాటు పరిశుభ్రతను పాటిస్తేనే భారత్ స్వచ్ఛభారత్‌గా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, సోమేష్, బాలకృష్ణ, వెంకటనారాయణ, ముత్యం, శ్రీను, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నాయకుడుకుంట చెరువు కట్ట (మినీ ట్యాంక్ బండ్) పై శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది మినీ ట్యాంక్‌బండ్‌పై చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం శివలింగాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో స్వచ్ఛత ప్రతిజ్ఞతో మానవహారంగా ఏర్పాటు చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు ఎస్‌బీఎం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర రావు, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని కరకగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన 'స్వచ్ఛత హీ సేవా'కార్యక్రమంలో భాగంగా కరకగూడెం ఎంపీపీఎస్, జెడ్పీ పాఠశాలల్లో మొక్కలు నాటారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శ్రమదానం చేసి పాఠశాలల్లో పిచ్చి మొక్కలను మొక్కలను, గడ్డిని తొలగించారు.

కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు మంజుల, తిరుపతమ్మ, గ్రామ పంచాయతీ సెక్రటరీ మారుతీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

భద్రాచలంఅర్బన్: తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త ఆటోలకు ప్రజలు అందజేయాలని ఐటీసీ వావ్ సంస్థ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుద్దకూరి రమ్య కాలనీ వాసులను కోరారు. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వావ్ సంస్థ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రమ్య మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో ప్రత్యక్షంగా వావ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీసీ వావ్ సంస్థ బాధ్యులు సౌజన్య, సీఆర్పీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'సామాజిక వనీకరణ'లో భాగస్వాములు కావాలి


బూర్గంపాడు: ఐకేపీ కార్యాలయంలో మహిళా శక్తి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు సామాజిక వనీకరణలో భాగస్వాములు కావాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. నాగినేనిప్రోలులో ఐటీసీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక వనీకరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం నాగినేనిప్రోలు ఐటీసీ నిర్మించిన బస్‌షెల్టర్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, పబ్లిక్ టాయిలెట్స్‌ను ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. రెడ్డిపాలెంలో ప్రభుత్వ గ్రాంట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో మౌలికవసతుల కల్పనకు ఐటీసీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. బూర్గంపాడులోని గౌతమిపురంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళా శక్తి పథకంలో కుట్టుమిషన్ల యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. నాగినేనిప్రోలులోని ఐలమ్మసెంటర్ వద్ద కాంగ్రెస్ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏలు, ఇతరులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ మేనేజర్ చెంగలరావు, ఐటీసీ ఎంఎస్‌కే ప్రోగ్రాం మేనేజర్ మనీష్, కాంగ్రెస్ నాయకులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తాళ్లూరి చక్రవర్తి, జక్కం బలరాం, భజన ప్రసాద్, మందా నాగరాజు, బర్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

పినపాక: భూపాల్ పట్నం పంచాయతీలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సుమారు 25 లక్షల రూపాయలతో నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నూతన పంచాయతీల్లోనూ కార్యాలయాలు నిర్మిస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండబత్తుల ఉపేందర్‌ను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఉపేందర్‌కు ఇటీవల గుండె ఆపరేషన్ కావడంతో ఎమ్మెల్యే పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పాల్గొన్నారు.

హోర్డింగ్‌లు రోడ్లపైకి రావొద్దు

మణుగూరుటౌన్: వ్యాపారుల తమ పబ్లిసిటీ హోర్డింగులను రోడ్లపై పెట్టొద్దని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కాలినడకన తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు తిరిగి దుకాణాల ముందర ఉంచే హోర్డింగ్‌లు, ప్రచారాలు షాపునకు దగ్గరగా ఉండాలని సూచించారు. రోడ్లపై హోర్డింగులు పెట్టడం వల్ల అక్కడికి కొనుగోళ్లకు వచ్చే ప్రజల వాహనాలు రోడ్లపై నిలిపి ప్రమాదాలకు కారకులవుతున్నారని తెలిపారు. రోడ్లపై తోపుడుబండ్లు వ్యాపారం చేసుకునే వారు కూడా తమ బండ్లు రోడ్డుకు దూరంగా నిలపాలని వాహనాల రాకపోకలకు అడ్డుగా పెట్టి ఇబ్బందులు కలుగజేయొద్దని సూచించారు.

కళాజాతా ద్వారా అవగాహన

చండ్రుగొండ: మాదకద్రవ్యాలతోపాటు సైబర్ నేరాలు, రోడ్డుభద్రతపై పోలీసుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో కళాజాతా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో చిన్నవయస్సులోనే యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న వైనంపై కళాప్రదర్శన ఆకుట్టుకుంది. ఎస్‌ఐ గంజి స్వప్న పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుళ్ళు రాంబాబు, స్వాతికుమార్, అహెమద్‌మియా, కళాకారులు కాంపల్లి బాబు, కృపానందం, మూస, నరేందర్, స్నేహ, నీలా, కుమారి, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జోనల్ గేమ్స్



ములకలపల్లి: విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

దుమ్ముగూడెం: మండలంలోని అన్ని పాఠశాల్లోని బాలబాలికలకు అండర్–14, 17 జోనల్ గేమ్స్ ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఎంఈఓ సున్నం సమ్మయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాల అవరణలోని క్రీడామైదానంలో 23వ తేదీ బాలికలకు, 24వ తేదీ బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

'జోనల్'పోటీలకు ఎంపిక

ములకలపల్లి: జగన్నాథపురం హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థినీ, విద్యార్థులు జోనల్‌స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీల్లో సత్తాచాటి జోనల్ పోటీల్లో చోటు దక్కించుకున్నారు. విద్యార్థులకు హెచ్‌ఎం వెంకట నర్సమ్మ, పీఈటీ పద్మా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రెండో రోజు కొనసాగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచారు. ఉత్తమ ప్రతిభను చూపిన క్రీడాకారులు జోనల్ క్రీడల్లో పాల్గొననున్నారు. కార్యాక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, మండలంలోని వివిద హైస్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులను ఉమ్మడి జిల్లా పాఠశాలల ఆర్‌సీఓ బ్యూలారాణి, పాఠశాల ప్రిన్సిపల్ పి.రజినిలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ క్రీడాపోటీల్లో సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడమే కాకుండా ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, ఏటీపీ సుమలత, ఉపాధాకచయులు పాల్గొన్నారు. అలాగే సాంబాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి ఖోఖో, రన్నింగ్ విభాగాల్లో ప్రథమ, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. క్రీడాపోటీల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రూ.94 కోట్ల శ్రీనిధి రుణాలు

చండ్రుగొండ: ఈ ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా సంఘాలకు రూ.94 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా తీసుకున్నామని శ్రీనిధి రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఐకేపీ కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో ఇప్పటి వరకు 1,639 సంఘాలకు రూ.15 కోట్లు రుణాలు ఇచ్చామని వివరించారు. రుణాల మంజూరీతోపాటు రికవరీలో సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. 50శాతం రుణాల రికవరీ జరిగిందని 100 శాతం రుణాల రికవరీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏపీఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్ల: మండలంలోని లింగాపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి శనివారం మీ కోసం మేమున్నాం సహాయక కమిటీ ఆర్థిక సాయాన్ని అందజేసింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కమిటీ ప్రతినిధులు నీలి ప్రకాశ్, పున్నం రామకృష్ణ, వేములపల్లి ప్రవీణ్, దొడ్డి సూరిబాబు, మీసాల యోమంత్‌లు బాధితుడు ముత్యాలరావుకు రూ.5 వేల నగదు, రూ.6,500 విలువ చేసే నిత్యావసరాలు, వంట సామగ్రిని, దుస్తులను అందజేశారు.

వరద బాధితులకు..

మణుగూరుటౌన్: ఇటీవల వచ్చిన వరదలకు సర్వం కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న చిరు వ్యాపారికి దోసపాటి నాగేశ్వర రావు శనివారం ఆర్థిక సాయం అందించారు. సుందరయ్య నగర్‌కు చెందిన వెంకటరాజుకు సంబంధించిన వస్తువులన్నీ వరదలో కొట్టుకుపోయావడంతోపాటు పెరాలసిస్ బారిన పట్టాడు. ఈ నేపథ్యంలో దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో చక్కబాలు, ఎస్‌కేటీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో మండల పరిధిలో విజయనగరం(తిర్లాపురం) గ్రామం వద్ద మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. మణుగూరు –ఏటూరునాగారం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి సంబంధిత పత్రాలను, పెండింగ్ చలాన్ల వివరాలను పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలను సేకరించి వదిలేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

మణుగూరుటౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతోందని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భుక్య శంకర్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఖ్యతో సంబంధం లేకుండా 50లోపు విద్యార్థులు ఉన్న స్కూల్‌కు ముగ్గురు ఉపాధ్యాయులను, 50–100 వరకు ఉన్న స్కూల్స్‌కు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ ప్రతి పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా.. పునరుద్ధరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి గడిచిన మూడు రోజులుగా తాగునీటి పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో గ్రామస్తులు తాగునీటి కోసం నానా అవస్థలు పడ్డారు. ఇప్పటివరకు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో గతంలో పంచాయతీ అధికారులు బోరు వేసి వాటర్ ట్యాంక్‌కు వరకు పైపు లైన్లు వేసి తాగునీటిని సరఫరా చేశారు. అయితే రైతు పొలంలో ఉన్న బోరు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మూడు రోజుల క్రితం తన వరి పొలానికి నీళ్లు మళ్లించాడు. విషయం తెలుసుకున్న కొంతమంది స్థానికులు పంచాయతీ కార్యదర్శి బాబు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి రైతు ఏర్పాటు చేసుకున్న అక్రమ కనెక్షన్‌ను పరిశీలించి సిబ్బందితో శనివారం తొలగించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఏడాది చివరి వరకూ తిప్పలేనా?

- నత్తనడకన సెంటర్ లైటింగ్ పనులు..
- ఏడాది చివరకు పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే..
- అప్పటి వరకు దుమ్మూధూళి తప్పనట్లే..


సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: ఈ ఏడాది చివరకు అశ్వారావుపేట సెంటర్ లైటింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. శనివారం సెంటర్ లైటింగ్ పనులను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారి వెంట నివసించే వారు.. స్థానికులు సెంటర్ లైటింగ్ పనుల వల్ల తాము పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చేందుకు కూడా సమయం అవకాశం ఇవ్వలేదు. ఏడాది చివర వరకు నత్తనడకన పనులు చేసుకుంటూ వెళతామని.. ఇందుకు ఎమ్మెల్యే ఆమోద ముద్ర వేసినట్లు ప్రజలను పరోక్షంగా హెచ్చరించినట్లయింది. ఖమ్మం, రాజమండ్రి జాతీయ రహదారిలో అశ్వారావుపేట, పేరాయిగూడెం పంచాయతీల మధ్య సుమారు 3 కిలోమీటర్ల మేర సెంటర్ లైటింగ్, డివైడర్ పనులను చేపడుతున్నారు. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈపనులను ఓ మంత్రి బినామీగా చెప్పుకునే కాంట్రాక్టర్ ఈ పనులను ఆరంభించారు. పలు కారణాలతో కాంట్రాక్టర్‌కు ఊపిరాడనీయకుండా పనులు చేయనివ్వలేదు. ఇందుకు అధికారులూ పూర్తి స్థాయిలో స్థానిక నాయకులకు సహకరించారు. తీరా ప్రభుత్వం మారిన తర్వాత స్థానికులే పనులను చేస్తున్నారు. కానీ పూర్తి నాణ్యతాలోపాలతో పనులు చేపట్టడం కారణంగా ఓ పక్కనుంచి కడుతుంటే మరోపక్క నుంచి కూలిపోతోంది. రహదారి గుంతలమయంగా మారి.. సిమెంట్, ఇసుక, బూడిదతో రహదారికి ఇరువైపులా అర కిలోమీటరు మేర ఇళ్లలో దుబ్బ వచ్చి చేరుతోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యలపై 'సాక్షి'లో గతంలోనే పలు కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈబాధలు ఎప్పుడు తీరుతాయా.. అని ప్రజలు ఎదురు చూస్తుంటే.. మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లయింది శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యాఖ్యలు. భద్రాచలంలో రోడ్‌లో రహదారి విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేయమని తాపీగా శెలవిచ్చారంటే ఖమ్మం, రాజమండ్రి రహదారితోపాటు భద్రాచలం రోడ్ ప్రజలకు ఏడాది చివర వరకు ఈ దుబ్బు, దుమ్ము, ధూళి కాలుష్యం తప్పదన్నమాట!

అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలి

దుమ్ముగూడెం: పాఠశాలలో జరిగే ప్రతీ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయం సీఎంఓ సైదులు సూచించారు. శనివారం మండలంలోని నరసాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు అధ్యక్షతన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పాఠశాల కార్యక్రమాల్లో తల్లిదండ్రులు భాగస్వామ్యం అయితేనే విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా ప్రతినిధి నిర్మల, స్టాఫ్ సెక్రటరీ చిలకమర్రి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: ఆగస్టు 31న జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో 74 కేజీల విభాగంలో భద్రాచలం సిటీ షైల్ జిమ్‌కు చెందిన డాక్టర్ శివ రామకృష్ణ ప్రసాద్ కాంస్య పతకం సాధించారు. అంతకముందు ఆగస్టు 7న రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జావలిన్ త్రో పోటీలలో ఎస్.కె.అమ్రిన్ బంగారు పతకం సాధించింది. పతకాలు సాధించిన ఈ ఇద్దరిని, భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుళ్లనూ అభినందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అంకిత్ కుమార్ మాట్లాడారు.

గురజాడ అప్పారావు జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హవీలా పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. మాట్లాడుతూ.. సంఘ సంస్కరణోద్యమం, మహిళా అభ్యుదయం కోసం గురజాడ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. రాంబాబు, డాక్టర్ కిరణ్ కుమార్, కిరణ్, వీరన్న, వరాల బాబు, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాపూజీ చేసిన సేవలను, త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు దుస్సా సమ్మయ్య, రమేష్, కుర్రి నర్సింహరావు, చంద్రశేఖర్, కోటా శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, రవీంధర్, వీరంకి వెంకట్రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కల్యాణంలో ఆలయ మేనేజర్ రమణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు


అన్నపురెడ్డిపల్లి: కాలినడకన గొత్తికోయ గ్రామానికి వెళ్తున్న డాక్టర్ చైతన్య, సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గోవిందాపురం గ్రామంలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అమ్మాజీ, హెచ్‌ఏ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం సావిత్రి, నరసమ్మ, సబ్ సెంటర్ ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో..

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం తిర్లాపురం పంచాయతీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు శేషగిరిరావు 211 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, శేషగిరిరావు మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, అవినాష్, అనురాధ, రామారావు, మారేశ్వర్‌రావు, రూపశ్రీ, నందిని, శ్రీకాంత్, రవి, లక్ష్మయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతంలో ఉన్న గొత్తికోయ గ్రామానికి వైద్య సిబ్బంది కాలి నడకన వెళ్లి వైద్య సేవలు అందజేశారు. శనివారం ఎర్రగుంట పీహెచ్‌సీ సిబ్బంది, మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంకతో కలిసి జిల్లా మాతా శిశుసంరక్షణ అధికారి చైతన్య అటవీ ప్రాంతంలో సుమారు 7 కిలోమీటర్లు నడుచుకుంటూ.. వాగులు, వంకలు దాటుకుంటూ గ్రామానికి చేరుకున్నారు. గొత్తికోయలకు వైద్యసేవలు చేసి, మందులు అందజేశారు. హెచ్‌ఈఓ రాంప్రద్, సూపర్‌వైజర్ ప్రకాశ్, ఏఎన్‌ఎం ప్రేమలత, ఆశాలు పాల్గొన్నారు.